క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మినీ చార్మినార్ నుంచి హైటెక్స్ రోడ్డు ప్రాంతం, ఇజ్జత్‌నగర్, అలేఖ్య అపార్ట్‌మెంట్ పరిసరాల ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్స్, ద శ్రీరామ స్కూల్, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్‌హిల్స్, వజ్రం అపార్ట్‌మెంట్స్, ఎస్‌వీడియో, ప్రైమ్ అపార్ట్‌మెంట్స్, టీఎన్‌జీవోస్ కాలనీ, ఐఐఆర్‌ఎం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

28న 'మనూ'లో సెమినార్

రాయదుర్గం : మనూ ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ జాతీయ సెమినార్‌ను నిర్వహించనున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫహీమ్ అక్తర్ శుక్రవారం తెలిపారు. ఇస్లామిక్ ఫిఖ్ అకాడమీ ఇండియా(ఐఎఫ్ఏఐ) సహకారంతో 'ఇండియన్ నాన్ ముస్లింమేతర ఇస్లామిక్ స్టడీస్' అనే అంశంపై ఈ సెమినార్ జరుగుతుందన్నారు.

ప్రత్యేక పూజలు



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ గ్రామంలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు నల్ల సంజీవరెడ్డి, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ వీధిలో చూసినా కుక్కలే..కుక్కలు



గుంపులుగుంపులుగా స్వైరవిహారం ● 14 నెలల్లో 453 మంది బాధితులు



భెల్‌లో..

జనవరి- 22	48
ఫిబ్రవరి	42
మార్చి	29
ఏప్రిల్	37
మే	39
జూన్	26
జూలై	41
ఆగస్టు	27
సెప్టెంబర్	30
అక్టోబర్	23
నవంబర్	27
డిసెంబర్	22
జనవరి-23	32
ఫిబ్రవరి-23	30

(రామచంద్రాపురం ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో కుక్కకాటు చికిత్స తీసుకున్నవారు)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతీనగర్, బీహెచ్ఈఎల్ పరిధిలోని ఏ కాలనీ.. ఏ వీధి చూసినా కుక్కలు గుంపులుగుంపులుగా కనిపిస్తున్నాయి. సగటున నెలకు 30మంది దాకా కుక్కకాటు బారిన పడుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గతంతో పోల్చుకుంటే రాత్రివేళ కుక్కల స్వైరవిహారం మరీ ఎక్కువైంది. రాత్రయిందంటే బయటకు వెళ్లాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. ఒక్క రామచంద్రాపురం ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో జనవరి 2022 నుంచి 2023 ఫిబ్రవరి 24వ తేదీ వరకు 453 మంది కుక్కకాటుకు సంబంధించిన ఇంజెక్షన్లు వేయించుకున్నారు. వీరేకాకుండా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించినవారూ ఉంటారు.

- పలు మాంసం దుకాణాల వద్ద మటన్‌కు సంబంధించిన వ్యర్థాలను వీధి కుక్కలకు వేస్తున్నారు. దీంతో ఆ పరిసరాల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది.
- నగరంలోని వివిధ ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను రాత్రివేళ తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తున్నారు. దీంతో ఆర్‌సీపురం పరిధిలో కుక్కల సంఖ్య పెరిగింది. గతంలో బీహెచ్ఈఎల్ కాలనీలో కొంతమంది వీధి కుక్కలను వదిలేసే ప్రయత్నం చేయగా, స్థానికులు నిలదీశారు. దీంతో వారు వెనక్కి వెళ్లారు.
- పలు కాలనీల్లో కుక్కలు ఇళ్లలోకి చొరబడిపోతున్నాయి. కనిపించిన వస్తువులను లాక్కెళ్లిపోతున్నాయి. డోర్ తీయాలంటేనే పలువురు హడలిపోతున్నారు.
- బైక్‌పై రోడ్డు మీదకు రావాలంటేనే భయపడుతున్నారు. బైక్‌ల వెంట కుక్కలు పడుతున్న కారణంగా పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- వీధి కుక్కల నియంత్రణలో భాగంగా వాటిని పట్టుకొని కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నామని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. అయినా రోజురోజుకు కుక్కల సంఖ్య పెరుగుతుందేకానీ తగ్గడం లేదు.
- చిన్నారులను తల్లిదండ్రులు బయటకు పంపలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ వారు బయటకు వెళ్లినా తిరిగొచ్చే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు.

ప్రజలు బెంబేలు..

శేరిలింగంపల్లి: వీధి కుక్కల సంచారంతో రోడ్డుపైకి రావాలంటేనే కాలనీలవాసులు జంకుతున్నారు. కాలనీల్లోని చౌరస్తాలు, జంక్షన్ల వద్ద తిరుగుతుండడంతో అటుగా వెళ్లేందుకు ప్రజలు బెంబేలెత్తున్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని సుదర్శన్ నగర్‌లో వీధి కుక్కలు రోడ్లపై గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. పలు చోట్ల జరుగుతున్న కుక్కల దాడులతో ప్రజలు జంకుతున్నారు.

బైక్‌పై వెళ్లాలంటే భయపడే పరిస్థితి



బైక్‌మీద రోడ్డుపైకి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వీధుల్లో కుక్కలు వాహనాల వెంట పడుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – గోపి, రామచంద్రాపురం

పిల్లలను బయటకు పంపలేకపోతున్నాం



అంబర్‌పేట ఘటన తర్వాత చిన్నారులను బయటకు పంపాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ వీధిలోకి వెళ్లినా కుక్కల బాధ తప్పడం లేదు. – మురళీకృష్ణ, రామచంద్రాపురం

వీధి కుక్కలను నివారించాలి



వీధి కుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో కన్నా ప్రస్తుతం వీటి సంఖ్య విపరీతంగా పెరిగింది. వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించాలి. – నాగరాజు గౌడ్, బీడీఎల్ కాలనీ

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

వీధి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సంబంధిత శాఖకు సంబంధించినవారు కుక్కలను ఎప్పటికప్పుడు పట్టుకుని వెళుతున్నారు. – బాలయ్య, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్

గచ్చిబౌలిలో ట్రాఫిక్ మళ్లింపు

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ మళ్లింపు, భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా లైవ్ కన్సర్ట్‌కు 17,520 మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి జంక్షన్‌కు వచ్చే వాహనాలను హెచ్‌సీయూ బస్ డిపో వద్ద ఎస్ఎంఆర్ వినయ్‌సిటీ, మసీద్‌బండ, బొటానికల్ గార్డెన్, గచ్చిబౌలి వైపు వెళ్లాల్సి ఉంటుంది. గచ్చిబౌలి సర్కిల్ నుంచి లింగంపల్లికి వెళ్లే వాహనాలు బొటానికల్ గార్డెన్, మసీద్‌బండ, హెచ్‌సీయూ బస్ డిపో వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. రాయదుర్గం నుంచి లింగంపల్లి వైపు వచ్చే వాహనాలను ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి గోపీచంద్ అకాడమీ, విప్రో సర్కిల్, క్యూసిటీ, గోపన్‌పల్లి, నల్లగండ్ల ఫ్లై ఓవర్ నుంచి వెళ్లాలన్నారు. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి జంక్షన్, గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. ట్రక్కులు, లారీలు, వాటర్ ట్యాంకర్లు, డీసీఎంలు, ఆర్ఎంసీ వాహనాలపై ఆంక్షలు ఉంటాయన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

మియాపూర్: ప్రతి ఒక్కరూ దైవచింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని విజయ దుర్గ అమ్మవారి ఆలయం 16వ వార్షికోత్సవం సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావుతో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'ఇంట్రెస్టింగ్ గాసిప్స్ ఇంటెన్సివ్‌లీ కార్మిక్' అనే అంశంపై ప్రముఖ యూత్ మోటివేటర్ బి.కె.రుచి ప్రత్యేక ఉపన్యాసం ఇస్తారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



గచ్చిబౌలి: కొండాపూర్ 8వ బెటాలియన్‌లో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పోలీస్ క్యాంప్‌లోని దుర్గామాత ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్‌యాదవ్ పాల్గొన్నారు. అర్చకులు రవీందర్‌శాస్త్రి బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠ జరిగింది. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ విజేత టీం మైసా



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ మూడో సీజన్లో టీం మైసా విజేతగా నిలిచింది. బ్యాంకాక్ లో జరిగిన ఫైనల్స్‌లో టీం మైసా 5.5–2.5 స్కోర్ తో టీమ్ స్వాన్స్‌పై విజయం సాధించింది. టైటిల్ పోరులో తొలి నాలుగు గేమ్స్‌లోనూ టీం మైసా విజయం సాధించి ఆధిక్యంలో నిలిచింది. అయితే తర్వాతి రెండు గేమ్స్‌లో టీమ్ స్వాన్స్ పుంజుకోవడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. ఈ దశలో చివరి రెండు గేమ్స్‌లో మరోసారి టీం మైసా ఆధిపత్యం కనబరిచి టైటిల్ కైవసం చేసుకుంది. ఫైనల్స్‌లో టీమ్ మైసా ఓనర్స్ దీపక్, శ్వేత చక్కని ఆటతీరుతో ఆకట్టుకున్నారు. కాగా హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ మూడో సీజన్‌లో ఛాంపియన్ గా నిలవడం సంతోషంగా ఉందని, లీగ్‌ను అద్భుతంగా నిర్వహించారని టీమ్ మైసా ఓనర్ దీపక్ చెప్పారు. బ్యాంకాక్ రాయల్ గేమ్స్ గోల్ఫ్ కోర్స్‌లో ఫైనల్స్ ఆడడం కొత్త అనుభూతి ఇచ్చిందని తెలిపారు.

మహిళ అదృశ్యం



లత(ఫైల్)

మాదాపూర్: మహిళ అదృశ్యమైన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ సాయినగర్‌లో నివాసముంటున్న మల్లేల శ్రీనివాస్ వ్యాపారి. ఆయన భార్య లత(40) గృహిణి. ఈనెల 11వ తేదీ సాయంత్రం 5గంటలకు లత ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లింది. ఆమె తెలుగు, హిందీ మాట్లాడగలదు. సమాచారం తెలిసిన వారు ఎస్‌హెచ్ఓ మాదాపూర్ 9490617182, 7126631198కి సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

గీతంలో దళితుల రచనలపై జాతీయ సదస్సు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్ఎస్) ఆధ్వర్యంలో వ్యవహారిక పత్రికలు, దళిత రచనలు, వెలువరించడంలోని సాధక బాధకాలు' అనే అంశంపై మార్చి 1,2, 3 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. మైసూర్ లోని భారతీయ భాషల కేంద్ర సంస్థ దళిత సాహిత్యాన్ని రాయడం, విశ్లేషించడం, అనువదించడాన్ని సమన్వయం చేస్తున్న సంస్థల (కళలు, మానవీయ శాస్త్రాల పరిశోధన మండలి, నాటింగ్ హామ్ ట్రెంట్-పాల్ వాలెరీ విశ్వ విద్యాలయాల) సహకారంతో దీనిని నిర్వహిస్తున్నట్టు సదస్సు సమన్వయకర్త డాక్టర్ శాంతన్ మండల్ శుక్రవారం తెలిపారు. భారతీయ భాషా పత్రికలలో పనిచేసేవారు, పరిశోధక విద్యార్థులు, బోధకులను ఈ సదస్సు ఆహ్వానిస్తోందన్నారు. వివిధ కులాలు, భాషల మధ్య జరుగుతున్న సంభాషణలు, ఆలోచనల మార్పిడి, స్వీయ శోధన, ఆత్మ పరిశీలనను ఈ సదస్సు ప్రోత్సహిస్తున్నట్టు డాక్టర్ శాంతన్ చెప్పారు. పత్రికా పరిశ్రమ, దేశీయ పత్రికలు, భాష, జాతి జాతీయత, కులం, జానపద కళా ప్రక్రియలు వంటి అంశాలపై ఔత్సాహికులు పత్ర సమర్పణ చేయొచ్చన్నారు. ప్రముఖ వక్తలు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.ఆసక్తి ఉన్నవారు తమ పేర్ల నమోదు, ఇతర వివరాల కోసం డాక్టర్ జోంధాలే రాహుల్ hira-man@gitam.edu/smondal@gitam.edu ఈ-మెయిల్ చేయాలని సూచించారు.

రాజ్యాంగంలో న్యాయం,స్వేచ్ఛకు ప్రాధాన్యం

సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ చలమేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జే. చలమేశ్వర్

రాయదుర్గం: రాజ్యాంగంలో పొందుపర్చిన న్యాయం, స్వేచ్ఛ ప్రాముఖ్యతను సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ జే చలమేశ్వర్ వివరించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అల్లాడి స్మారక ఉపన్యాస కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సుల '75 ఏళ్ల భారత న్యాయవ్యవస్థ, దాని స్వాతంత్ర్యం, సమర్థత' అనే అంశంపై చలమేశ్వర్ మాట్లాడారు. రాష్ట్రంలో కార్యనిర్వాహక, శాసనసభ, న్యాయవ్యవస్థ వంటి వివిధ శాఖల మధ్య అధికార పంపిణీని ఆధునిక ప్రజాస్వామ్యాలు ఎలా నిర్ధారిస్తున్నాయనే దాని గురించి వివరించారు. కొలీజియం వ్యవస్థపై ఆయన వ్యాఖ్యానిస్తూ దానికి అవసరమైన పారదర్శకత లోపించిందన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

వైష్ణోయ్ హోండాకు అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో ద్విచక్ర వాహన డీలర్‌షిప్ వైష్ణోయ్ హోండా ప్రతిష్ఠాత్మకమైన డీలర్ కస్టమర్ సెంట్రిసిటీ టూ వీలర్ అవార్డును దక్కించుకుంది. ముంబైలో ఆటోకార్ ఇండియా–2023 కార్యక్రమంలో ఈ అవార్డును వైష్ణోయ్ హోండా డైరెక్టర్ శరత్ చంద్ర అందుకున్నారు. 2013లో కొండాపూర్‌లో కార్యకలాపాలను ప్రారంభించిన వైష్ణోయ్ హోండా, తర్వాత తెలంగాణ వ్యాప్తంగా తమ ఔట్‌లెట్స్‌ని విస్తరించింది. గచ్చిబౌలి, మాదాపూర్, మోతీనగర్, శంకర్‌పల్లి, పరిగి, వికారాబాద్, కొడంగల్, మోమిన్‌పేట్ మరియు తాండూరుతో సహా తొమ్మిది ప్రాంతాలకు విస్తరించింది. వైష్ణోయ్ హోండా ఎల్లప్పుడూ కస్టమర్ సంతృప్తికి ప్రాధాన్యత ఇస్తుందని డైరెక్టర్ శరత్ చంద్ర తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన అవార్డు దక్కడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ ఎంతో కృషి చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం ఉద్యమించే మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, కోశాధికారి శ్రీనివాసరావు, నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్ పరిధిలోని మొగులమ్మ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనితో ఆయన శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో పైప్‌లైన్లు లైన్లు చిన్నవి కావడంతో సమస్య వస్తోందన్నారు. కాలనీలో జనాభా పెరగటంతో పెద్ద పైప్‌లు వేయాలన్నారు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడారు. సమస్యను పరిశీలించి పరిష్కరించాలని, అదే విధంగా సీసీ రోడ్లకు ఎస్టిమేషన్ వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అలాగే ఎన్‌టీఆర్ నగర్ వాటర్‌ట్యాంక్ వద్ద వీధిలో నూతనంగా నిర్మించవలసిన డ్రైనేజీ, సీసీ రోడ్డు వ్యయం అంచనా వేయాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామ్మకృష్ణ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జాన్, షౌకత్ అలీ మున్నా, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మొగులమ్మ కాలనీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయం



సమావేశంలో నాయకులు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: నానక్‌రాంగూడలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు మీన్‌లాల్‌సింగ్,సంతోష్‌సింగ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్‌భారత్, ముద్ర యోజన, తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు హన్మంతునాయక్, నర్సింహారావు, వరలక్ష్మి, కిషన్, శివాసింగ్, శ్రీకాంత్‌రెడ్డి, బబ్లూసింగ్ పాల్గొన్నారు.

మస్తాన్‌నగర్‌లో..

గచ్చిబౌలి: ప్రజల గోస పట్టని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి ఎం రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ డివిజన్ మస్తాన్‌నగర్‌లో బీజేపీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరానికి మకుటంలాంటి హైటెక్‌సిటీకి ఆనుకొని ఉన్న కాలనీ మస్తాన్‌నగర్ అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. ప్రభాకర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యార్థి సంఘ ఎన్నికలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం 2022–23 ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో 5,300 మంది విద్యార్థులు ఓట్లు వేశారు. క్యాంపస్‌లో శనివారం ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఏబీవీపీ, ఓబీసీఎఫ్, ఎస్ఎల్‌వీడి విద్యార్థి సంఘాలు ఒక కూటమిగా, ఏఎస్ఏ, డీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ మరో కూటమిగా , అలయన్స్ ఫర్ సోషల్ డెమొక్రసీ పేరిట బీఎస్ఎఫ్, ఫ్రెటర్నిటీ, ఎంఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, టీఎస్ఎఫ్ ఇంకో కూటమిగా దిగాయి. వీటికి పోటీగా వైఐఎస్ఎస్ విద్యార్థి సంఘం కూడా పోటీలో ఉంది.

కమాన్ ప్రారంభం

మియాపూర్: మియాపూర్ డివిజన్ మక్తమహబూబ్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన కమాన్‌ను బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్, అనిల్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. మారబోయిన సత్యనారాయణ యాదవ్ జ్ఞాపకార్థం సత్యనారాయణ సేవా సమితి చైర్మన్ అనిల్ కుమార్ యాదవ్ సహకారంతో కమాన్ నిర్మించారు. కార్యక్రమంలో రాఘవేంద్రరావు, రమేష్, లక్ష్మణ్, గణేష్, వినోద్, శ్రీను, శివరాజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.